సాక్షి
కామారెడ్డి
బుధవారం, 13, డిసెంబర్, 2023



విచారణ చేపట్టాలి
దళితబంధులో అక్రమాలపై విచారణ జరపాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆదేశించారు.
- 9లో ▸



ఆటో డ్రైవర్ల ఆందోళన
'మహాలక్ష్మి' పథకంతో తమ బతుకులు ఆగమయ్యాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /12.5

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి'



కామారెడ్డి క్రైం: ప్రజలతో సత్సంబంధాలను కలిగి ఉండాలని ఎస్పీ సింధు శర్మ పోలీస్ అధికారులకు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌పై మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, దొంగతనాలు, మోసాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యత తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నేరాలు జరుగుతున్న తీరు, వాటి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి ఒక్కో అధికారి చొప్పున పాల్గొన్నారు.

కామారెడ్డి నియోజకవర్గ సమీక్ష సమావేశం వాయిదా

కామారెడ్డి టౌన్: నియోజకవర్గ స్థాయి అధికారులతో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం నిర్వహించాల్సిన సమీక్ష సమావేశం వాయిదా పడింది. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేవీఆర్ కలెక్టర్‌ను కోరడంతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశాన్ని అధికారులు వాయిదా వేయడం గమనార్హం. బల్దియాలో సమస్యలు, విద్య, వైద్యంతో పాటు అన్ని శాఖలతో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లోగల రోటరీ ఆడిటోరియంలో మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, ఎన్నికల ప్రక్రియలు నిర్వహించారు. పి.వెంకటేశ్వర్‌రెడ్డి, పంపరి విజయ్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ సాగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ముస్కు జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా శేర్ల రమేష్, రంగా వెంకటేశ్వరగౌడ్, ఎ.దత్తాత్రి, ఎండీ అతీకుల్లా, బీఆర్ గౌమతి, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాస్, ఎస్.మధుసూదన్ రెడ్డి, కే.వీణ, బి.భాస్కర్‌రెడ్డి, టి.శివాగౌడ్, కోశాధికారిగా ఎం.నరేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆర్.నవీన్, ఎం.దివ్య, జి.లక్ష్మణ్, జి.అనిల్‌కుమార్, డి.నరేష్, ఎ.మహేంద్రచారి, ఓ.అంకుష్, జి.నవీన్, ఓ.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేడు శివం కమిటీ సమావేశం

నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాలకోసం ప్రాజెక్టులనుంచి నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవడానికి బుధవారం హైదరాబాద్‌లో శివం కమిటీ సమావేశం కానుంది. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు పోచారం ప్రాజెక్టు నీటి విడుదలపై ఈ కమిటీ చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కమిటీ నివేదిక ఆధారంగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తామని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

రేపు 'పోచారం' త్రైబంది సమావేశం

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే విషయమై గురువారం ఆయకట్టు రైతులతో త్రైబంది సమావేశం నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నీటిని ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 'బీ' జోన్‌కు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయకట్టు పరిధిలోని రైతులతో గురువారం త్రైబంది సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

కేడర్‌కు భరోసా!

- కార్యకర్తలతో సమావేశమవుతున్న బీఆర్ఎస్ లీడర్లు
- ఓటమితో కుంగిపోవద్దంటూ ధైర్యవచనాలు
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్న నేతలు

అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన ఓటమితో డీలా పడిన బీఆర్ఎస్ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. కార్యకర్తలతో సమావేశమవుతూ పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారు. ఓటమితో కుంగిపోవద్దని చెబుతూ భవిష్యత్‌పై ఆశలు కల్పిస్తున్నారు. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకోసం శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. బాన్సువాడలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి చవి చూశారు. కామారెడ్డి నుంచి స్వయంగా గులాబీ దళపతి కేసీఆర్ పోటీ చేసినా ఓటమిపాలవడం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశలో ముంచింది. ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్, జుక్కల్‌లో హన్మంత్‌సింధే కూడా ఓడిపోయారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గులాబీ శ్రేణులు తీవ్ర ఆవేదనతో ఉన్నాయి.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా..

వచ్చే ఏడాదిలో వరుసగా ఎన్నికలు రానున్నాయి. ముందుగా పంచాయతీ ఎన్నికలు, తర్వాత పార్లమెంటు, ఆపైన మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేడర్‌లో ధైర్యాన్ని నింపితే ఆ ఎన్నికల్లో సత్తా చాటొచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి అన్ని నియోజక వర్గాల్లో బలమైన నాయకత్వం ఉంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరూ దాదాపు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ అన్ని చోట్ల విజయం సాధించాలన్న వ్యూహంతో బీఆర్ఎస్ నేతలు అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని గుణపాఠంగా తీసుకుని మరింత బలోపేతం కావాలన్న లక్ష్యంతో సాగుతున్నారు. ఇందులో భాగంగా అధికార పక్షం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాము అండగా ఉంటామన్న భరోసా ఇస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు సమయం దగ్గరలోనే ఉండడంతో గ్రామాల్లో ఉండి ప్రజలతో మమేకం కావాలని నేతలు సూచిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో లేనప్పటికీ బలమైన ప్రతిపక్షంగా పనిచేయడం ద్వారా ప్రజల్లో పట్టు సాధిద్దామని చెబుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలు కేడర్‌తో సమావేశాలు నిర్వహిస్తూ భరోసా ఇస్తుండడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతోంది.

శ్రేణుల్లో జోష్ నింపేందుకు..

ఓటమితో నిరాశ చెందిన కేడర్‌లో ఉత్తేజం నింపేందుకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు చర్యలు చేపట్టారు. కేడర్‌లో నెలకొన్న నిరాశ, నిస్పృహలను తొలగించి వారికి తామున్నామనే భరోసా కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎల్లారెడ్డికి సంబంధించి ఇటీవల మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఓటమికి నైతిక బాధ్యత తనదేనన్నారు. ఎవరూ ఎవరినీ నిందించవద్దని, భవిష్యత్తు మీద భరోసాతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సురేందర్ సందేశం పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్నిచ్చింది.

జుక్కల్‌లో స్వల్ప తేడాతో ఓడిపోయిన హన్మంత్ సింధే సైతం ఇప్పటికే నియోజకవర్గంలో రెండు సభలు నిర్వహించారు. కార్యకర్తలతో సమావేశమై గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓడిపోయామని కుంగిపోవద్దని కార్యకర్తలకు నచ్చజెప్పారు. గట్టిగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. బాన్సువాడలో బీఆర్ఎస్ సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలిచినా.. రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం రాలేదు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని ఆశించిన గులాబీ శ్రేణులు నిరాశలో ఉన్నాయి. వారికి భరోసా ఇవ్వడానికి సమావేశం నిర్వహించాలని పోచారం నిర్ణయించారు. బుధవారం సోమేశ్వర్ చౌరస్తా వద్దనున్న ఫంక్షన్ హాల్‌లో ఆయన కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

వరి నాట్లు షురూ



రాంపూర్ శివారులో నారు తీస్తున్న మహిళలు

బాన్సువాడరూరల్: మండలంలో యాసంగి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా మొన్నటి వరకు నీటి నిడుదల చేయడంతో ఆ నీటిని మళ్లించి నాట్లు వేస్తున్నారు. రాంపూర్, పోచారం, ఇబ్రహీంపేట్ గ్రామ శివార్లలో వరినాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బోరుబావుల వద్ద నారుమడులు సిద్ధం చేసిన అన్నదాతలు నీళ్లు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యా రు. సాధారణంగా యాసంగితో పోలిస్తే వానాకాలంలోనే వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. కానీ దానికి భిన్నంగా ఈ సారి యాసంగిలోనూ వరిసాగు విస్తీర్ణం పెరగనుంది. మెట్ట ప్రాంతాలైన కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్ గ్రామాల్లో గతంలో అరు తడి పంటల సాగుకే మొగ్గు చూపేవారు. ఈ యేడు వర్షాలు పుష్కలంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో బోరుబావుల కింద వరి సాగుకే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు.

నిండుకుండల్లా చెరువులు

నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీళ్ల విడుదల కావడంతో మండలంలోని ఆయకట్టు కింద ఉన్న దాదాపు అన్ని గ్రామాల చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. వానాకాలంలో వర్షాలతో భూగర్భ జలాలు పెరిగి బోర్లు కూడా బాగా పోస్తున్నాయి. దీంతో గత సంవత్సరం యాసంగిలో ఆరుతడి పంటలను సాగు చేసిన రైతన్నలు ఈ సారి వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ముందస్తుగా సాగు చేయడంతో పంటకోతల సమయంలో అకాల వర్షాల ద్వారా సంభవించే నష్టం నుంచి గట్టెక్కవచ్చని వ్యవసాయ అధికారులు సూచించడం కూడా నాట్లు ఊపందుకోవడానికి కారణంగా చెప్పవచ్చు. బాన్సువాడ మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.



హన్మాజీపేట్‌లో నాటేసిన పొలం

పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం

- నిధులు విడుదల చేసిన సర్కారు
- వర్షాకాలం సీజన్‌లో కొత్త మార్గదర్శకాలొచ్చే అవకాశం

మోర్తాడ్(బాల్కొండ) : యాసంగి సీజన్ పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించడానికి కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత పద్ధతినే అనుసరిస్తుంది. గత వర్షాకాలం సీజన్‌లో రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ చేసిన విధానంలోనే ఈ సీజన్‌లో అందించడానికి కార్యాచరణ చేపట్టింది. తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చి ఎకరానికి ఒక్కో సీజన్‌లో రూ. 7,500ల చొప్పున అందిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో పేర్కొంది. రైతుభరోసాకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించి అమలు చేసే సరికి ఎక్కువ సమయం పడుతుందని తేల్చిన ప్రభుత్వం ఈ సీజన్‌లో పాత విధానాన్నే అనుసరించడానికి మొగ్గుచూపింది.

సాధారణ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే రైతుబంధు సాయాన్ని విడుదల చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుంది. కాని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్ రావు ఓ ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ పెట్టుబడి సాయాన్ని నిలిపేసింది. గత ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ట్రెజరీలో జమ చేసి ఉంచింది. ఇప్పటికే యాసంగి సీజన్ పనులు మొదలు కావడం రైతులు పెట్టుబడి కోసం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించడం చేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పాత విధానంలోనే జమ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలత స్పష్టం చేయడంతో తొలిరోజు ఎకరంలోపు భూమి ఉన్నవారికి రైతుబంధు సాయం జమ చేశారు. ఇలా ఒక్కో రోజు భూమి విస్తీర్ణంను పెంచుతూ జమ చేయనున్నారు.

పరీక్షా ఫలితాలు వెల్లడి

తెయూ: తెయూ ప్రీ-పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ యాదగిరి కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణతో కలిసి మంగళవారం విడుదల చేశారు. అక్టోబర్5 నుంచి 7 వరకు నిర్వహించిన ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించి 16 సబ్జెక్టుల్లో 137 మంది స్కాలర్స్ హాజరు కాగా వారిలో 134 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వివరాలకు తెయూ వెబ్‌సైట్ చూడాలన్నారు. ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆరతి, అడిషనల్ కంట్రోలర్ సాయిలు, అపర్ణ, లావణ్య పీఆర్‌వో పున్నయ్య ఉన్నారు.



ఎవరు.. ఎక్కడికో..?

- ప్రభుత్వం మారడంతో బదిలీలపై జోరుగా చర్చలు
- పోలీస్ శాఖపైనే అందరి దృష్టి
- అనుకూల అధికారులపై అధికార పార్టీ ఫోకస్
- పోస్టింగుల కోసం పైరవీలు షురూ



సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికారుల బదిలీల అంశం తెరపైకి వచ్చింది. అధికారంలోకి వచ్చినవారు తమ అనుకూల అధికారులకు మంచి పోస్టింగ్‌లు ఇప్పించుకోవడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో తమకు అనుకూలంగా ఉండే వారి కోసం వెతుకులాట మొదలవుతుంది. దీనికి తోడు పోస్టింగ్‌ల కోసం వేచిచూసే అధికారులు తమకు పరిచయం ఉన్న నేతలతో పైరవీలు చేయించడం పరిపాటిగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల వద్దకు పోలీస్ అధికారులు వరుస కడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ పాలనలో పోస్టింగ్‌లు పొందిన అధికారుల్లో బదిలీల భయం పట్టుకుంది. మొన్నటిదాకా వారికి అనుకూలంగా పనిచేశామనే ముద్ర ఉండడంతో తమకు బదిలీ తప్పదనే భావనతో కొందరు పోలీసు అధికారులు ఉన్నారు.

జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు చాలా మంది ఏడాది కాలంలో వచ్చినవారే.. మరికొంత కాలం పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైనవారిని తెచ్చుకుంటారని వారు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నేతలను కలిసి కొంతకాలం తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు తమ పార్టీ నేతలకు సహకరించకపోగా, ఇబ్బంది పెట్టిన అధికారుల విషయంలో అధికార పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు.

అనుకూలమైన పోస్టింగ్ కోసం..

జిల్లాలో డీఎస్పీ, సీఐ పోస్టుల కోసం ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు అధికారులు ఇప్పటికే పైరవీలు షురూ చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో మూడు సబ్ డివిజన్లు ఉండగా ఆయా పోస్టుల కోసం పలువురు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే కీలకమైన ఎస్‌హెచ్‌వో పోస్టుల కోసం కూడా పైరవీలు సాగిస్తున్నారు. కామారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో ఎస్‌హెచ్‌వోలుగా, అలాగే కామారెడ్డి, భిక్కనూరు, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఆయా ప్రాంతాల్లో ఎస్సైలుగా పనిచేసి ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న వారు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే కొన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్సైలుగా పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతూ పైరవీలు చేసుకుంటున్నారని తెలిసింది. ఇదే సమయంలో పదేళ్ల తర్వాత చేతికి అధికారం రావడంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. తమకు అనుకూల అధికారులను తెచ్చుకుని తమ బలాన్ని చాటుకోవాలని ఆరాటపడతున్నారు. వచ్చే ఏడాది వరుసగా ఎన్నికలు ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు సహకరించే అధికారులు ఉండాలని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. గతంలో తమకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పోలీసు శాఖలో ఉన్నతాధికారుల బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో వారి బదిలీల అనంతరం జిల్లా స్థాయి అధికారుల బదిలీలు జరుగతాయని, తరువాత సబ్ డివిజనల్, సర్కిల్ స్థాయిలలో బదిలీలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బకాయిలు రూ.55.72 కోట్లు

- జీవన్‌రెడ్డి ఆర్థిక అక్రమాల చిట్టా విప్పుతున్న యంత్రాంగం
- ప్రభుత్వం మారాక బయటకొస్తున్న ప్రభుత్వరంగ సంస్థలు
- వరుసగా బకాయిలు వెల్లడించిన విద్యుత్, ఆర్టీసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు
- మరోవైపు నియోజకవర్గంలో పలువురి ఆస్తులు తాకట్టుపెట్టిన జీవన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆర్మూర్‌లో 'మాల్' నిర్మాణం కోసం తీసుకున్న ఎస్ఎఫ్‌సీ రుణాల వడ్డీ అసలును మించిపోయింది. ఆర్టీసీ స్థలం లీజుకు సంబంధించి బకాయిలు ఏళ్లుగా పేరుకుపోయాయి. విద్యుత్ బకాయిలదీ అదే పరిస్థితి. పైగా బకాయిల వసూలులో జీవన్‌రెడ్డిపై ఒత్తిడి తేవద్దని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ సిబ్బందికి సూచించడం వివాదాస్పదమవుతోంది.



బకాయిల వసూళ్ల కోసం ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు వచ్చిన ఆర్టీసీ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మారనంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న వివిధ విభాగాల అధికారులు కొత్త ప్రభుత్వం వచ్చాక మాత్రం పూనకం వచ్చిన మాదిరిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్ నిర్మాణం కోసం తీసుకున్న రుణానికి సంబంధించి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ స్థలంలో మాల్ నిర్మాణం కోసం ఆరున్నర సంవత్సరాల క్రితం రూ.20 కోట్లు విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరిట తీసుకున్నారని, ఇందుకు సంబంధించి వడ్డీతో కలిపి రూ.45,46,90,000 చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ బకాయిలను 60 రోజుల్లో చెల్లించని పక్షంలో రికవరీ చట్టాల మేరకు చర్యలకు ముందుకెళ్లాల్సి ఉంటుందని ఆ నోటీసుల్లో హెచ్చరించారు. అసలుతో పాటు వడ్డీ సైతం కొండంత పేరుకుపోయేవరకు బకాయిలు వసూలు చేసే విషయంలో ఇప్పటివరకు ఏమీ పట్టనట్లు ఉన్న స్టేట్ ఫైనాన్స్ అధికారులు ఇప్పుడు హడావుడి చేస్తుండడం విశేషం. కాగా ఈ రుణానికి పూచీకత్తు ఉన్న మరో నలుగురికీ నోటీసులు జారీ చేశారు.

■ జీవన్‌రెడ్డికి సంబంధించిన ఒక్క ఆర్మూర్ మాల్ విషయంలోనే మూడు ప్రభుత్వరంగ సంస్థల అధికారుల కారణంగా బకాయిలు కొండంత పేరుకుపోయాయి. చివరకు మాల్ విలువ కంటే అనేక రెట్లు బకాయిలు చేరాయి. ఈ నేపథ్యంలో మాల్‌ను స్టేట్ ఫైనాన్స్, ఆర్టీసీ, విద్యుత్ సంస్థల్లో ఎవరు స్వాధీనం చేసుకోవాలో అనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ గందరగోళానికంతటికీ అధికార యంత్రాంగం నిర్వాకమే కారణమనేది మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. కాగా మరోవైపు నియోజకవర్గంలో పలువురి ఆస్తులు తాకట్టుపెట్టి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ అధికారులు..

జీవన్‌రెడ్డి మాల్‌కు సంబంధించి స్థలం లీజుకిచ్చిన ఆర్టీసీ తనకు రావాల్సిన రెంటల్ బకాయిల విషయమై ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఆర్టీసీకి రూ.7,23,71,807 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇన్నేళ్ల పాటు బకాయిల రికవరీలో తమకేమీ పట్టనట్లు వ్యవహరించిన ఆర్టీసీ అధికారులు, తీరా భారీగా బకాయిలు పేరుకుపోయాక.. రుణాలు ఇచ్చిన సంస్థలు, విద్యుత్ సంస్థలు వచ్చిన సమయంలోనే నోటీసులతో రావడం గమనార్హం. ఎప్పటికప్పుడు వసూలు చేసుకుంటే ఇంత భారీగా బకాయిలు పేరుకునేవి కావు.

విద్యుత్ బకాయిల కథ..

ఇక విద్యుత్ కథ మరోలా ఉంది. బకాయిలు రూ.2,57,20,002 వరకు పేరుకుపోయాయి. పేదలు, బడుగు జీవులు కేవలం రూ.300 బకాయి ఉంటేనే విద్యుత్ సరఫరా నిలిపేసే విద్యుత్ అధికారులు జీవన్‌రెడ్డికి మాత్రం రకరకాల మినహాయింపులు, అవకాశాలు ఇవ్వడం చెప్పుకోదగ్గ అంశం. ఈ బకాయిల వసూలులో జీవన్‌రెడ్డిని ఏమాత్రం ఒత్తిడి చేయవద్దని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో 12 వాయిదాల్లో చెల్లించేలా 2023 ఫిబ్రవరి 4న సీఎండీ అనుమతిచ్చారు. అయినప్పటికీ చెల్లించకపోవడంతో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ మరోసారి 2023 అక్టోబర్ 13న అనుమతులు ఇచ్చారు. అయినప్పటికీ జీవన్‌రెడ్డి చెల్లించలేదు. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేయలేదు. అయితే ప్రభుత్వం మారడంతో విద్యుత్ అధికారులు తామేదో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న మాదిరిగా సరఫరా నిలిపేయడం విశేషం. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, జీవన్‌రెడ్డి మాత్రం కిందిస్థాయి సిబ్బందితో ఆటలాడుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎండీ వ్యవహారశైలిపైనా విచారణ చేయాల్సిన అవసరముందని పలువురు డిమాండ్లు చేస్తున్నారు. అసలు జీవన్‌రెడ్డి బకాయిల విషయంలో బతిమిలాడాలని సిబ్బందికి సీఎండీ సూచించడమేమిటో అనేది తేల్చాల్సిన అవసరముందని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

జాతీయ విలువిద్య పోటీలకు శ్రీనిక



డొంకేశ్వర్(ఆర్మూర్): జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన మద్దుల శ్రీనిక ఎంపికైంది. ఈ నెల 13, 14వ తేదీల్లో గుజరాత్ నదియాడ్‌లో నిర్వహించే 14 సంవత్సరాల విభాగంలోని ఎస్‌జీఎఫ్ఐ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి శ్రీనిక పాల్గొనే అవకాశం రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖోకు ఎంపిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ పాఠశాల విద్యార్థిని సరోజ జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు అతీకుల్లా మంగళవారం తెలిపారు. ఈనెల 13 నుంచి కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించే అండర్- 14 విభాగం జాతీయ ఖో-ఖో పోటీల్లో సరోజ పాల్గొంటుందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన సరోజను స్థానికులు అభినందించారు.

అవిశ్వాసం నోటీసులు అందజేత

రాజంపేట: సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం కోరుతూ డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి విన్నవించగా, ఆయన మంగళవారం నోటీసులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వ సహకార సంఘముల చట్టం 1964లోని సెక్షన్ 34- ఏ(3) ,24-ఏ(1) ప్రకారం జనవరి 2న జిల్లా సహకార అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు నోటీసులో పేర్కొన్నారు. సమావేశానికి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

కేవైసీ పేరిట ఇబ్బందులు

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకు అధికారులు ప్రతి దానికి కేవైసీ అంటు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ఖాతాదారులు పేర్కొన్నారు. ఖాతా తీసుకునే సమయంలో నామినీ వివరాలు ఇచ్చినప్పటికీ.. వాటిని నమోదు చేయకుండా మళ్లీమళ్లీ అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కాగా ప్రతిదానికి కేవైసీ అవసరం లేదని, ఖాతాదారుని నమూనా సంతకం తనిఖీ చేసి పనులు చేయాలని బ్యాంకు మేనేజర్ స్పష్టం చేశారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి వీరవెంకట రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలంకరణ చేశారు.

కళాశాలల్లో ఫీజుల దందా..

- సీఎస్‌ఎఫ్ పేరిట విద్యార్థుల నుంచి వసూళ్లు
- యూనివర్సిటీకి చెల్లించకుండా మూడేళ్లుగా తప్పించుకుంటున్న యాజమాన్యాలు
- సీరియస్‌గా తీసుకున్న వర్సిటీ అధికారులు



నిజామాబాద్‌అర్బన్: సీఎస్‌ఎఫ్ పేరిట తెలంగాణ యూనివర్సిటీకి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల నుంచి అందాల్సిన రూ. కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఈ సారి ఎలాగైనా వసూలు చేస్తామని యూనివర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 50 ప్రైవేటు, 26 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు ప్రవేశం పొందేటప్పుడు వారి నుంచి సీఎస్‌ఎఫ్ (కామన్ సర్వీస్ ఫీజు) పేరిట వసూలు చేస్తున్నాయి.

వీటిని ఆయా కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ యూనివరిట్సీకి చెల్లించాలి. కానీ వాటిని చెల్లించకుండా గత మూడేళ్లుగా నాన్చుతూ తప్పించుకు తిరుగుతున్నాయి. అధికారులు సైతం సీఎస్‌ఎఫ్ చెల్లించని కళాశాలలకు నోటీసులు జారీ చేసినా ఆయా కళాశాలలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకువస్తూ అధికారులను మభ్యపెడుతూ ఫీజులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాయి.

ప్రతి ఏటా 30 వేల మంది..

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు సంబంధించి ప్రతిఏటా 30 వేల మంది విద్యార్థుల ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీటిని యూనివర్సిటీకి చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రెండు, మూడేళ్లుగా విద్యార్థుల సీఎస్‌ఎఫ్ ఫీజులు చెల్లించక యూనివర్సిటీకి ఎగనామం పెడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం మూడు కళాశాలలు మాత్రమే సీఎస్‌ఎఫ్‌ను చెల్లించాయి. దీంతో ఇప్పటి వరకు యూనివర్సిటీకి రావాల్సిన సుమారు రూ. రెండున్నర కోట్ల ఫీజు రాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి.

బోధన్, ఆర్మూర్, కామారెడ్డిలో..

బోధన్‌లోని ఓ కళాశాల రెండేళ్లు, ఆర్మూర్‌లోని ఓ కళాశాల ప్రజాప్రతినిధి ఒత్తిడితో మూడేళ్లు, కామారెడ్డిలోని ఓ కళాశాల యాజమాన్యం తమ రెండు కళాశాలలకు చెందిన ఫీజులను చెల్లించక తప్పించుకు తిరుగుతున్నాయి. వీటికి యూనివర్సిటీ అధికారులు సీఎస్‌ఎఫ్ చెల్లించాలని నోటీసులు జారీ చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

సీరియస్‌గా యూనివర్సిటీ అధికారులు

సీఎస్‌ఎఫ్ ఫీజు చెల్లించని డిగ్రీ కళాశాలపై వర్సిటీ అధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఇటీవల సంబంధిత కళాశాలలకు నోటీసులు సైతం జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో సీఎస్‌ఎఫ్ చెల్లించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అనంతరం కళాశాలల యాజమాన్యాలు అసోసియేషన్ తరఫున యూనివర్సిటీ ఉన్నతాధికారులను కలిసి మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నా అధికారులు సైతం సీఎస్‌ఎఫ్ చెల్లించాల్సిందేనని వారితో పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజును ఎందుకు చెల్లించడం లేదని ఉన్నతాధికారులు నిలదీసినట్లు తెలిసింది.

చర్యలు తీసుకోవాలి



కామన్ సర్వీస్ ఫీజు పేరిట విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న వాటిని ఆయా యాజమాన్యాలు యూనివర్సిటీకి చెల్లించాలి. లేకుంటా ఆయా కళాశాలల ఎదుట ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతాం. సీఎస్‌ఎఫ్ చెల్లించని వాటిపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లాల్‌సింగ్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఆందోళనలు చేస్తాం



ప్రైవేటు డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి రూ. వేల చొప్పున వసూలు చేస్తున్న కామన్ సర్వీస్ ఫీజును యూనివర్సిటీకి చెల్లించక పోవడం సిగ్గుచేటు. తక్షణమే ఆయా కళాశాలల యాజమాన్యాలు సీఎస్‌ఎఫ్ చెల్లించాలి. లేకుంటే ఆందోళనలు, ధర్నాలు చేపడుతాం.

– రఘురాం, ఏఐఎస్‌ఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి

పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న లీలా లక్ష్మారెడ్డి

భిక్కనూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్, చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. తెయూ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన వాతావరణ మార్పు జాతీయ సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పర్యావరణం చాలా ప్రమాదంలో ఉందని పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. సౌత్‌క్యాంపస్‌లో వాతావరణం చాలా బాగుందని, క్యాంపస్‌లో ఔషధ వనాన్ని, వ్యర్థపదార్థాల నిర్వహణ, నీటి యాజమాన్య, పద్ధతుల విషయంలో నిరంతరం సహకారం అందిస్తామన్నారు. సదస్సులో హైదారాబాద్ సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్ సర్వోత్తం, సెల్ఫ్ డైరెక్టర్ సాయిభాస్కర్, క్యాంపస్ ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ సుధాకర్‌గౌడ్, కో-కన్వీనర్లు డాక్టర్ రాజేశ్వరి, నారాయణ, అధ్యాకులు మోహన్‌బాబు, హరిత, లలిత, సవిత, ప్రతిజ్ఞ, నాగరాజు, యాలాద్రి సునీత, వైశాలి, రమాదేవీ, నర్సయ్య నిరంజన్‌శర్మ, శ్రీకాంత్, దిలీప్, ఇంద్రకరణ్, కనకయ్య, సునీల్, ఏపీఆర్‌వో సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న సక్రునాయక్

రామారెడ్డి: క్రీడల్లో గెలుపోటములు సహజమని గురుకులాల జాయింట్ డైరెక్టర్ సక్రునాయక్ అన్నారు. మండలంలోని ఉప్పల్వాయి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల బాలుర పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి అయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో ఓటమి చెందిన వారు ఆత్మన్యూనతకు లోను కావద్దని క్రీడాకారులకు సూచించారు. అనంతరం విజేత జట్లకు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రీజినల్ కో-ఆర్డినేటర్ అలివేలు, టోర్నమెంట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. శంకర్, స్థానిక ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ గంగారాం, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.10వేల పింఛన్ అందించాలి



కామారెడ్డి రూరల్: రాజీనామా చేసిన బీడీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీనామా చేసిన బీడీ కార్మికులకు ప్రస్తుతం రూ.350 నుంచి రూ.వెయ్యి వరకు మాత్రమే చెల్లిస్తుండడంతో నష్టపోతున్నారన్నారు. పింఛన్‌ను పెంచుతామని గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు పెంచలేదన్నారు. పింఛన్‌ను పెంచని పక్షంలో లేబర్ కార్యాలయాల ఎదుట బీడీ కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీడీ కార్మికులకు యాజమాన్యాలు 26 రోజుల పని కల్పించాల్సి ఉండగా 10 నుంచి 15 రోజులే పని కల్పిస్తున్నారన్నారు. కొన్ని బీడి కంపెనీలు కార్మికులకు పీఎఫ్ నంబర్ కల్పించి జీవన భృతి వెంటనే అందే విధంగా చూడాలన్నారు. అలాగే వెయ్యి బీడీలకు సరిపడా తునికాకు అందించాలన్నారు. లేబర్ అధికారులు బీడి కంపెనీల యజమానులపై తగు చర్యలు తీసుకొని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఈనెల 15, 19న గణిత ప్రతిభా పరీక్షలు



ఉత్తర్వులను అందజేస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు గణిత దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గణిత ప్రతిభా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని డీఈవో ఎస్ రాజు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల స్థాయిలో ఈనెల 15న, జిల్లా స్థాయిలో 19వ తేదీన డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గణితఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్, డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, సిద్ధిరామాగౌడ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ బండి రామగిరి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రాష్ట్ర ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు రూ.లక్షా యాభై వేల చెక్కును మంగళవారం అందజేశారు.

రామగిరి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకొని ఈ చెక్కును అందించినట్లు తెలిపారు. మండల అసోసియేషన్ తరఫున మరో రూ. 15 వేలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభుగౌడ్, భిక్కనూరు మండల అధ్యక్షుడు ఉప్పరి లింబాద్రి, ఆసం సిద్ధరాములు, భూర్ల శ్రావణ్, సమీర్, బత్తుల భిక్షపతి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆసం శ్రీనివాస్ నేతలు నవీన్, బాలరాజు, భూపాల్‌రెడ్డి, సురేశ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులకు అందుబాటులో ఉండాలని ఏఈవోలకు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం జిల్లా స్థాయి ఏఈవోల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి రైతుబంధు, పీఎం కిసాన్, రైతుబీమా, ఆయిల్‌పామ్, పంట వివరాల నమోదు, క్వాలిటీ కంట్రోల్ తదితర కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో ఏడీఏలు రత్న, అపర్ణ, వీరస్వామి, అనిల్, ఏవోలు ప్రజాపతి, ఏఈవోలు పాల్గొన్నారు.

పీజీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తెయూ: తెయూ పరిధిలోని పీజీ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షల ఫీజు చెల్లింపు తుదిగడువును ఈ నెల 15వరకు పొడిగించినట్లు కంట్రోలర్ అరుణ మంగళవారం తెలిపారు. పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజును ఈ నెల 15వరకు, రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 18వరకు చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్ అరుణ కోరారు.

20 నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ: తెయూ పరిధిలోని డిగ్రీ (బీఏ, బీకా, బీఎస్సీ, బీబీఏ) 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు డిసెంబర్ 20 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ మంగళవారం తెలిపారు. రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు.

విండో సిబ్బంది పనితీరు బాగుంది



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో సిబ్బంది పనితీరు బాగుందని జిల్లా సహకార అధికారి సింహాచలం అన్నారు. మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సహకార సంఘం పరిధిలో చేపడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లన త్వరితగతిన చేసినందుకు అభినందించారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, విండో సీఈవో బైరయ్య, క్లస్టర్ అధికారి నగేశ్, లింగమూర్తి, గంగరాజు, బైరేశ్, నవీన్, నబీ, చందు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు శ్యాం, లక్ష్మణ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ దశమ వార్షికోత్సవం

దోమకొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ దశమ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, పుణ్యహవచనం, అఖండ దీపారాధన, స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. బలిదానం, పూర్ణాహుతి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి మహాపడిపూజ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి దశమ వార్షికోత్సవాలకు హాజరవుతారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కదిరె మోహన్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాన్సువాడ ఎమ్మెల్యేకు సన్మానం



శ్రీనివాస్‌రెడ్డి సన్మానిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

బాన్సువాడ : అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మొదటి సారి బాన్సువాడకు వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయా మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోచారంను కలిసిన వారిలో మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, నిజాంసాగర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, మనోహర్, రమేశ్‌గౌడ్, వాజిద్‌అలీ, అంజయ్య, చందర్‌రాథోడ్ తదితరులున్నారు.

సీఈని కలిసిన ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): నీటి పారుదలశాఖ సీఈ శ్రీనివాస్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మంగళవారం కలిశారు. నియోజకవర్గంలోని చెరువులు, కుంటల స్థితిగతులను సీఈ దృష్టికి తీసుకు వెళ్లారు. చెక్‌డ్యాములు, చెరువుల మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు కృషి చేయాలని సీఈకి ఎమ్మెల్యే సూచించారు.

నేడు పర్యటన

మద్నూర్: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం మద్నూర్, డోంగ్లీ మండలాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శిస్తారని, అనంతరం స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తారని తెలిపారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నాయకులతో సమావేశమవుతారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామారెడ్డి అర్బన్: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కామారెడ్డి డివిజన్ ఆపరేషన్స్ ఈఈ సాలియా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని మర్కల్, పోసానిపేట, బ్రాహ్మణపల్లి, కన్‌కల్, తాడ్వాయి, ఎర్రపహాడ్, లింగాపూర్, ఆర్గొండ, కొండాపూర్, గుండారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

విత్తనశుద్ధి చేసి నారు పోయాలి

ఎల్లారెడ్డి: రైతులు నారు మడిలో విత్తనాలను వేసే ముందు వాటిని శుద్ధి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రేవంత్‌నాథన్, అనిల్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆజామాబాద్‌లో రైతులకు వరి సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. రైతులు వరి నారు అలికే ముందు విత్తనాలను శుద్ధిచేస్తే చీడ పురుగుల బాధ తప్పుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజాగౌడ్, సర్పంచ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ ఖైదు

కామారెడ్డి క్రైం: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అజామాబాద్‌లో 2017 నవంబర్3న జరిగిన ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈడిగి పర్వగౌడ్‌ను హత్య చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన చింతకాయల ఊశయ్య, దుర్గయ్య, సాయిలు నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో నేరస్తులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి తీర్పు వెల్లడించారు. కేసు పరిశోధన, సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టడంలో కృషి చేసిన ఎల్లారెడ్డి సీఐలు సుధాకర్, శ్రీనివాస్, పీపీ రాజ్‌గోపాల్‌గౌడ్, కోర్టు కానిస్టేబుళ్లు కిరణ్‌గౌడ్, బాలకృష్ణ, లైజనింగ్ అధికారి విఠల్‌ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

వార్డు సభ్యురాలు మృతి

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తండాలో వార్డు సభ్యురాలు ఒలికి బషవ్వ (50) మంగళవారం మృతి చెందింది. రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు నూతనంగా నిర్మించిన డ్రైనేజీలో పడడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల మహిళా కార్యకర్తగా కొనసాగిన బషవ్వ మృతిని తెలుసుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి ద్వారా రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సర్పంచ్ నాన్కుబాయి పీర్యానాయక్, ఎంపీటీసీ యశోద రతన్, నాయకులు సంగం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, సంజీవ్‌రెడ్డి, కొండ సాయిలు, నరేశ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి విశ్వబ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి వెంకటరమణాచారి, గౌరవ అధ్యక్షుడిగా రాములుచారి, ఉపాధ్యక్షులుగా రమేశ్‌చారి, ప్రధాన కార్యదర్శిగా లింబాద్రిచారి, కోశాధికారిగా మురళిచారి, ఉపకార్యదర్శిగా బ్రహ్మంచారి ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా కాంతంచారి, వడ్ల రాములు చారి, బాలరాజుచారి, రాజుచారి, లక్ష్మీపతిచారిని ఎన్నుకున్నారు.

షబ్బీర్ అలీని కలిసిన జెడ్పీటీసీ

దోమకొండ: మాజీ మంత్రి షబ్బీర్‌అలీని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం కలిశారు. దోమకొండ మండలానికి సంబంధించి వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు జెడ్పీటీసీ తెలిపారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించామన్నారు. ఆయన వెంట పార్టీ సింగిల్‌విండో డైరెక్టర్ మధుసూదన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, నాయకులు గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.